క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన దుర్గా భవాని



భట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దుర్గాభవాని

బెల్లంపల్లి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్గాభవాని కలిశారు. హైదరాబాద్‌లో శనివారం డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

ఘనంగా గీత హవన హోమం

జన్నారం: మండలంలోని రోటిగూడలో గీత జయంతిని పురస్కరించుకుని శనివారం గీత మాత ఆలయంలో సామూహిక హోమాలు చేశారు. ప్రముఖ పూజారి శ్రీ హరి మౌనస్వామి ఆధ్వర్యంలో 108మంది భక్తులు గీత యగ్నంలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం హోమంలో పాల్గొన్నారు. గీతమాత నామ స్మరణతో ప్రాంగణం మారుమోగింది. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ప్రముఖ కాంట్రాక్టర్ పూర్ణచందర్‌రావు పూజల్లో పాల్గొన్నారు. పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్క విజయ, ఎంపీటీసీ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఎదుట గల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి అందజేశారు.

దళితులకు ప్రాధాన్యమివ్వాలి

నెన్నెల: స్థానిక సంస్థాగత ఎన్నికల్లో దళిత, గిరిజనులకు ప్రాధాన్యతనివ్వాలని, నామినేటెడ్ పదవులు కల్పించాలని శనివారం తెలంగాణ ఆదివాసీ రాష్ట్ర గిరిజన మహిళా నాయకురాలు లక్ష్మి, నేతకాని సంఘం జిల్లా కార్యదర్శి బానేష్ కోరారు. ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తేనే అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తారన్నారు. ప్రభుత్వం దళిత గిరిజనులపై ప్రత్యేక దృష్టి సారించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు.

'మద్దతు ధర దక్కేవరకు పోరాడుతాం'

బెల్లంపల్లి: రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర దక్కేవరకు పోరాడుతామని రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగతి రవి, జిల్లా అధ్యక్షుడు ఇందూరు తిరుపతి తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని దివంగత మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిని నిర్వహించారు. సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు పద్మకిషన్, జిల్లా కార్యదర్శి మణికంఠ, కన్నెపల్లి, కాసిపేట మండలాల అధ్యక్షుడు వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు

బెల్లంపల్లి: మహిళా సాధికారితపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వేరువేరుగా సదస్సులు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో వక్తలు వి జయ, మౌనిక మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

క్రిస్మస్ సందడి..!



జిల్లా కేంద్రంలోని దుకాణంలో క్రిస్మస్ అలంకరణలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న క్రిస్మస్ తాత టోపి, డ్రెస్

- మార్కెట్‌లో ఆకర్షణీయ వస్తువులు
- కొనుగోలు చేస్తున్న ప్రజలు

మంచిర్యాలటౌన్: క్రిస్మస్ పండుగ యావత్ ప్రపంచానికే పర్వదినం. ఏసు ప్రభువు పుట్టిన రోజున క్రైస్తవులు పండుగ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 25న జరిగే క్రిస్మస్ పండగ కోసం ప్రార్థనా మందిరాలు అందంగా అలంకరిస్తుండగా, గృహాల అలంకరణ వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తాయి. కావాల్సిన సామగ్రి దుకాణాల్లో అందుబాటులో ఉండడంతో, క్రైస్తవుల పండగ వ్యాపారం మార్కెట్‌లో సందడి నెలకొంది. మార్కెట్లలో వివిధ రకాల క్రిస్మస్ ట్రీలు, రకరకాల బొమ్మలు, పూలు, బెల్స్(గంటలు), శాంతాక్లాజ్(క్రిస్మస్ తాత) బొమ్మలు, బ్యాటరీతో వెలిగే వివిధ రకాల విద్యుత్ దీపాలు, బైబిల్ గ్రంథాలు, అలంకరణ వస్తువులు, క్రిస్మస్ వేడుకలకు అలంకరించే వివి ధ రకాల చంకీలతో ఉన్న దండలు, కంజెరలు, స్టి క్కర్లు మార్కెట్లలో విభిన్న రీతిలో దర్శనమివ్వగా, అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. క్రిస్మస్ పండుగకు క్రిస్టియన్లు నూతన వస్త్రాలతో పాటు, క్రిస్మస్ పండగ అలంకరణ వస్తువులను కొనుగోలు చేస్తుండగా, మార్కెట్లో విక్రయాలు జోరందుకున్నాయి.

రంగు రంగుల నక్షత్రాలు..

నిరుపేదల నుంచి ధనవంతుల వరకు ప్రతి క్రిస్టియన్ తన ఇంటికి రంగు రంగుల స్టార్లను అలంకరించడం సంప్రదాయం. యేసు క్రీస్తు జన్మించారని వచ్చే వెలుగుకు గుర్తుగా ఈ స్టార్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలోనే అనేక రకాల స్టార్స్ మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. వీటి విలువ రూ.60నుంచి రూ.650 వరకు ఉన్నాయి. అలంకరణకు విభిన్న రంగుల్లో విద్యుత్ దీపాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటి ధర రూ.100నుంచి రూ.1000 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పేపర్, ప్లాస్టిక్, ఫైబర్, ఎల్ఈడీలతో చేసిన నక్షత్రాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి.



క్రిస్మస్ లైట్లు



క్రిస్మస్ ట్రీ

మెరిసే తోరణాలు..

మేరీ క్రిస్మస్, హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ అనే ఇంగ్లీషు అక్షరాలను పేర్చి రూపొందించిన రంగు రంగుల తోరణాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అనేక రకాల సైజుల్లో ఇవి లభ్యమవుతున్నాయి. ఫ్లవర్ల డిజైన్లు తళుక్కున మెరుస్తుండగా వాటి ధర రూ.200నుంచి రూ.500 వరకు ఉన్నాయి. శాంతాక్లాజ్, క్రిస్మస్ తాత, యేసు ప్రభువు స్టిక్కర్స్ చాలా అందంగా ఉన్నాయి. క్రిస్మస్ తాత మాస్కులు రూ.200 వరకు ఉండగా, క్రిస్మస్ తాత పూర్తి డ్రెస్ రూ.300 నుంచి రూ.వెయ్యి వరకు లభిస్తున్నాయి.

కాంతులు వెదజల్లే క్రిస్మస్ ట్రీలు..

విద్యుత్ కాంతుల మధ్య వెలిగిపోతున్న క్రిస్మస్ ట్రీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. యేసు ప్రభువు జన్మించిన డిసెంబర్ నెలలోనే ఈ క్రిస్మస్ ట్రీ ఎక్కువగా పూస్తుండడం వల్ల ఈ ట్రీస్‌ను ఎంతో పవిత్రంగా భావిస్తారు. వీటిని రంగు రంగుల గ్రీటింగ్ కార్డ్స్, విద్యుత్ బల్బులను, చమ్కీ పూలతో అలంకరిస్తారు. వీటి ధర రూ.50 నుంచి రూ.5వేల వరకు ఉండగా, మేరి క్రిస్మస్ బ్యానర్ రూ.80నుంచి రూ.250వరకు, మేరి క్రిస్మస్ బెలూన్స్ రూ.35నుంచి రూ.50వరకు, బెల్స్ రూ.15నుంచి 50, క్రిబ్‌సెట్ రూ.350నుంచి రూ. 1,500 వరకు మార్కెట్‌లో వివిధ రకాల మోడళ్లలో లభిస్తున్నాయి.

ఏటా కొత్త డిజైన్లు కొంటున్నారు



ప్రతీ ఏడాది క్రిస్మస్‌కు తప్పనిసరిగా అన్ని ర కాల వస్తువులను కొనుగో లు చేస్తుంటారు. మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే డిజైన్లను ఎక్కువగా ప్రజలు ఇష్టపడుతున్నారు. దీంతో ఏటా కొత్తగా ఉండే వాటిని మా దుకాణంలో అందుబాటులో ఉంచుతున్నాం. క్రిస్మస్‌కు వారం రో జుల పాటు ఎక్కువగా గిరాకీ ఉంటుంది. అన్ని రకాల డిజైన్లను దుకాణంలో అందుబాటులో ఉంచాం.

– గోపాల్, షాప్ నిర్వాహకుడు, మంచిర్యాల

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



చెన్నూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని క్రిస్మస్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్లు సంతోషంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలని కానుకలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పాస్టర్లు వివేక్‌ను సన్మానించారు. నియోజకవర్గానికి 1000కానుకలు మంజూరు కాగా చెన్నూర్ మండలంలో 30మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీపీ మంత్రి బాపు, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, జెడ్పీటీసీ తిరుపతి, కౌన్సిలర్లు, పాస్టర్లు పాల్గొన్నారు. అనంతరం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.25కోట్ల ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరుకు కృషి చేయాలని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మున్సిపల్ చైర్మన్ అర్చనరాంలాల్‌గిల్డా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

భైరవస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో కొలువైన కాలభైరవస్వామిని ఎమ్మెల్యే వివేక్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీవైస్ చైర్మన్ మూలరాజిరెడ్డి, నాయకులు బాపురెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

గిరిజన పాఠశాల ప్రారంభం

మందమర్రిరూరల్: చెన్నూర్ మండలంలోని లక్ష్మీపూర్‌లో గిరిజన పాఠశాలను ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు పరిష్కరిస్తామని తెలిపారు. సర్పంచ్ శారద, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసేవకులుగా పని చేయాలి

జైపూర్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ ప్రజా సేవకులుగా పనిజేయాలని ఎమ్మెల్యే వివేక్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మండల వ్యాప్తంగా ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 89మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునిత, తహసీల్దార్ రమేశ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న నాయకుడు

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యేగా వివేక్ వెంకటస్వామి గెలిస్తే కొండగట్టు ఆంజనేయస్వామికి 50గ్రాముల వెండి గద చేయించి స్వామికి బహూకరిస్తానని మొక్కుకున్న కాంగ్రెస్ నాయకుడు అకారపు రమేష్ శనివారం కుటుంబ సభ్యులతో కొండగట్టుకు వెళ్లి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లిలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తానన్నారు. తాను కూడా క్రిస్టియన్ మిషనరీ పాఠశాలల్లో చదువుకున్నానని గుర్తు చేశారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం సహకరించిన క్రైస్తవులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు రామునాయక్, సురేష్, ప్రభాకర్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ రేగుంట రాజలింగును పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమిని: కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లికి చెందిన మోర్ల భీమయ్య ఇల్లు శుక్రవారం అగ్నిప్రమాదానికి గురికాగా శనివారం ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆధైర్య పడొద్దని భరోసా కల్పించారు. తక్షణ సాయం కింద రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

'ప్రజా ఆశీర్వాదాన్ని మరవలేను'

వేమనపల్లి: ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల ఆశీర్వాదాన్ని ఎన్నటికీ మరిచిపోనని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. మండలంలోని నీల్వాయిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పూలదండలు, శాలువాలు కప్పి సన్మానం చేశారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ షబీర్ అలీ తండ్రి అబీబ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సర్పంచ్‌లు గాలి మధు, దుర్గక్క, కుత్రం పద్మ, నాయకులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

నస్పూర్: సీపీఐ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని షిర్కే సెంటర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ జెండాను ఆవిష్కరించారు. పేద ప్రజల న్యాయమైన హక్కులు సాధించడానికి పార్టీ తరుపున నిరంతరం పోరాడుతామని తెలిపారు. మండల కార్యదర్శి మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి రవి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు, జిల్లా సమితి సభ్యుడు మోత్కూరి కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీలో చేరికలు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ3, 3ఏ గనికి చెందిన పలువురు టీబీజీకేఎస్ కార్యకర్తలు శనివారం ఐఎన్టీయూసీలో చేరారు. ఎస్సార్పీ3, 3ఏ గనిపై జరిగిన కార్యక్రమంలో సుమారు 80మంది కార్యకర్తలు ఐఎన్టీయూసీలో చేరగా, వారికి ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, ఫిట్ సెక్రటరీ పెట్టం శ్రీనివాస్, నాయకులు సురేందర్‌రెడ్డి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు.

'సమస్యల పరిష్కారం ఐఎన్టీయూసీతో సాధ్యం'

కాసిపేట: సింగరేణిలో కార్మికుల సమస్యలు ఐఎన్టీయూసీ యూనియన్‌తోనే సాధ్యమవుతాయని ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట 2గనిపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని, కార్మికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు.

యూనియన్‌లో చేరికలు:

కాసిపేట 2గనిపై టీబీజీకేఎస్, ఇతర యూనియన్ల నుంచి 30మందికి పైగా కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. కాసిపేటలో మాజీ పిట్ కార్యదర్శి సమ్మయ్యతో పాటు పలువురు ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బెల్లంపల్లి: వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద..



తాండూర్: పూజల్లో పాల్గొన్న భక్తులు



మందమర్రిరూరల్: పూజలో పాల్గొన్న జీఎం దంపతులు



చెన్నూర్‌లోని జగన్నాథాలయంలో పూజలు



భీమారంలో ఉత్తరద్వారా దర్శనం

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

బెల్లంపల్లి/తాండూర్/చెన్నూర్/మందమర్రిరూరల్/జన్నారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/భీమారం: వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాలకు భక్తజనం పోటెత్తింది. బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. భక్తులు కుంకుమ పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట గోవింద క్షేత్రంలో ప్రత్యేక అలంకరణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(జెడ్పీ సీఈఓ) నరేందర్-సుధారాణి దంపతులు, బెటాలియన్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్-రేఖ దంపతులు, సర్పంచ్ దంపతులు లగిశెట్టి లక్ష్మి-రాజయ్యతో పాటు బెటాలియన్ అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొని దర్శనం చేసుకున్నారు.









గుడిపేట గోవింద క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనంలో జెడ్పీ సీఈఓ, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, సర్పంచ్, భక్తులు



రామకృష్ణాపూర్: నృత్యం చేస్తున్న చిన్నారులు



జనగామ పాఠశాలలో వేడుకలు



మంచిర్యాలఅర్బన్: నారాయణ పాఠశాలలో..



మంచిర్యాలఅర్బన్: శ్రీచైతన్య పాఠశాలలో...

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

కోటపల్లి/రామకృష్ణాపూర్/మంచిర్యాలఅర్బన్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో ముందస్తు కిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్, నారాయణ, శ్రీచైతన్య, ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలల్లో, కోటపల్లి జనగామ ప్రాథమిక పాఠశాలలో, రామకృష్ణాపూర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో, గద్దెరాగిడిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో వేడుకలు నిర్వహించగా విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. శాంతాక్లాజ్ వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.



మంచిర్యాలఅర్బన్: స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో...



ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకుంటూ...



అల్ఫోర్స్ పాఠశాలలో శాంతాక్లాజ్ వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు

ప్రశంసా పత్రం అందజేత

లక్సెట్టిపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎన్నికల కమిషన్ నిర్వహించిన స్వీప్ క్రేతాన్ పోటీల్లో ప్రశంసా పత్రం, నగదు బహుమతులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వీడియో తయారు చేయడంలో హరీష్, విజయ్ ప్రథమ, ద్వితీయ స్థానాన్ని పొందినట్లు తెలిపారు. వీరికి ప్రశంసా పత్రంతో పాటు రూ.20వేలు నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు మాస్కులు పంపిణీ

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం జేఎన్1 వేరియంట్ వ్యాపిస్తున్నందునా విద్యార్థులకు, సిబ్బందికి సఖీ లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ బండ శాంకరీ మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణగోపాల్, మాధవిలత, అర్చన ఉన్నారు.